క్లుప్తంగా

అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ రేపు

కొనకనమిట్ల: మండలంలోని 26 పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులకు ఈ నెల 14న స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఈశ్వరమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 సంవత్సరానికి గ్రామ పంచాయతీ, మండల పరిషత్ అభివృద్ధి ప్రణాళిక తయారు చేయడంపై రెండు విడతలుగా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. శిక్షణ కార్యక్రమాలకు ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, ఏపీఓ, సచివాలయ ఇంజినీర్లు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని ఎంపీడీఓ సూచించారు.

అక్రమ మద్యం స్వాధీనం

కంభం: మండలంలోని దేవనగరం గ్రామంలో బెల్టుషాపుపై దాడి చేసి 10 క్వార్టర్ బాటిళ్లు సీజ్ చేసి ఒకరిని అరెస్టు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి మంగళవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారంతో గ్రామంలో తనిఖీలు చేపట్టి బెల్టుషాపు నిర్వహిస్తున్న ఓ మహిళను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

గ్రంథాలయ వారోత్సవాలు రేపు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని గ్రంథాలయంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ ప్రసన్నకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెండా ఆవిష్కరణతోపాటు విద్యార్థులకు వక్తృత్వ, వ్యాస రచన పోటీలు, డ్రాయింగ్, రంగవల్లికలు, చెస్, తాడాట, కుర్చీల ఆట, లెమన్ స్పూన్ తదితర పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థుల వివరాలను పాఠశాల హెచ్‌ఎంలు స్వీయ ధ్రువీకరణతో సమర్పించాలని కోరారు.

స్వచ్ఛందంగా ఆక్రమణల తొలగింపు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని పాత బస్టాండు వద్ద అయ్యప్పస్వామి గుడి వీధిలో ఆక్రమణలను దుకాణాల యజమానులే స్వచ్ఛందంగా తొలగించారు. మంగళవారం ఉదయం మున్సిపల్ అధికారులు ఆక్రమణలు తొలగించేందుకు రాగా వ్యాపారులు తమ షాపులపై ఉన్న రేకులు, అలాగే మెట్లు, దిమ్మెలు, ఇతర సామగ్రిని స్వచ్ఛందంగా తొలగించారు. ఇప్పటికే మెయిన్ బజారులో కూడా పలువురు వ్యాపారులు తమ దుకాణాల ముందు ఆక్రమణలను తొలగించారు. ఆక్రమణల తొలగింపుతో వచ్చిన మట్టిని మున్సిపల్ అధికారులు తొలగించారు.

మెడికల్ కళాశాల పనులు పూర్తి చేయాలి

మార్కాపురం: మార్కాపురం మెడికల్ కళాశాల పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరికి విజయవాడలో మంగళవారం ఆ పార్టీ మార్కాపురం ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు వినతిపత్రం ఇచ్చారు. బడ్జెట్‌లో వెలిగొండ ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించి ఆర్‌ఆర్ ప్యాకేజీ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. మార్కాపురం జిల్లా ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కోరారు.

గోకులంలో పచ్చపాతం!

- అధికార పార్టీ నాయకుల సిఫార్సులకే అగ్రతాంబూలం
- మినీ గోకులం మంజూరులో అధికారుల వివక్ష
- పొదిలి మండలంలో 6 పంచాయతీలకు 25 మంజూరు
- అన్నీ టీడీపీ సానుభూతిపరులకే ఇవ్వడంపై విమర్శలు
- ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల్లో అర్హులకు మొండిచేయి


అక్క చెరువులో గుంతల కొలతలు తీస్తున్న ఉపాధి హామీ ఈసీ

పొదిలి రూరల్: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తామంటూ ఊదరగొడుతున్న సీఎం చంద్రబాబు మాటలు క్షేత్ర స్థాయిలో నెరవేరడం లేదు. పొదిలి మండలంలో ఇటీవల మంజూరైన మినీ గోకులం షెడ్లను పరిశీలిస్తే వాస్తమేంటో స్పష్టంగా తెలుస్తుంది. పొదిలి నగర పంచాయతీతో పాటు, మండలంలో 16 పంచాయతీలు ఉన్నాయి. నగర పంచాయతీతో మిగిలిన 10 పంచాయతీలకు ఒక షెడ్ కూడా మంజూరు కాలేదు. 6 పంచాయతీలకు మాత్రం 25 మంజూరయ్యాయి. ఇందులో ఓసీలకు 14, బీసీలకు 11 మాత్రమే దక్కాయి. అక్కచెరువులో 4, ఈగలపాడు-5, ఆముదాలపల్లి-5, కొండాయపాలెం-5, మల్లవరం-5, ఉప్పలపాడులో ఒకరికి గోకులం షెడ్ మంజూరు చేశారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు మొండిచేయి చూపారు. దీనిని బట్టి అధికారులు ఎంత వివక్ష చూపారో అర్థమవుతుంది. ముందుగా ప్రతి గ్రామంలో రైతులకు అవగహన కల్పించాలి. నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ గోకులం మంజూరు చేయాలి. కానీ కేవలం అధికార పార్టీ నాయకుల సిఫార్సులకే అధికారులు పెద్ద పీట వేశారు.


షెడ్ నిర్మాణానికి ఈగలపాడులో తీసిన గుంతలు

పథకం అమలు ఇలా..

మినీ గోకులాలకు ఎస్సీ, ఎస్టీ, ఇతర తెగలు చిన్న, సన్న కారు రైతులు అర్హులు. వీరితో పాటు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న మహిళలు, దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలి. పశు వైద్యులు గ్రామానికి వచ్చి అర్జీ వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదె పరిశీలించాలి. ఉపాధిహామీ ఏపీఓ గోకులం షెడ్డు నిర్మాణానికి అనువైన స్థలం, రైతు అర్హతను పరిశీలించి ఆన్‌లైన్ చేయాలి. కానీ ఇక్కడ అలా జరగడం లేదు. అధికార పార్టీ నాయకుల మాటే వేదం. 25 గోకులాలు మంజూరైనా ఇప్పటికీ తూతూ మంత్రంగా గుంతలు తీస్తున్నారే తప్ప ఎక్కడా షెడ్ నిర్మించిన దాఖలాలు లేవు.

ఎందుకింత వివక్ష?

మినీ గోకులం షెడ్లపై రైతులకు అవగహన కల్పించకుండా, గుట్టు చప్పుడు కాకుండా అధికార పార్టీ నేతలు చెప్పినట్లు అధికారులు వ్యవహరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పొదిలి పంచాయతీతోపాటు నందిపాలెం, కంభాలపాడు, పోతవరం, మాదాలవారిపాలెం, మూగచింతల, ఓబులక్కపల్లి, తుమ్మగుంట, రామాపురం, సూదనగుంట, పాములపాడు, గొల్లపల్లి, కుంచేపల్లి, ఉన్నగురువాయుపాలెం, అన్నవరం, తీగదుర్తిపాడు, తలమళ్ల, గోగినేనివారిపాలెం, ఏలూరు, జువ్వలేరు గ్రామాల రైతులకు ఒక్క గోకులం షెడ్ కూడా మంజూరు చేయకపోవంలో ఆంతర్యమేమిటో అధికారులకే తెలియాలి. ప్రస్తుతం మంజూరైన 25 గోకులాలు అధికార తెలుగుదేశం పార్టీ వారికి చెందినవే. ఈ మంజూరైన 25 గోకులాలకు సంబంధించి ఒక్కొక్కరికి ఆరు పశువుల లెక్కన అందరికీ ఒకే రకం అంచనాలు తయారు చేయడం గమనార్హం. వైఎస్సార్ సీపీ, కాంగ్రెస్, బీజేపీ సానుభూతిపరులకు ఒక్క గోకులం షెడ్ కూడా మంజూరు కాకుండా అధికార పార్టీ నేతలు చక్రం తిప్పినట్లు ఆరోపణలున్నాయి. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఒక్క షెడ్ కూడా మంజూరు కాకపోవడం టీడీపీ నేతల కుట్రను తేటతెల్లం చేస్తోంది.

మినీ గోకులం పథకం వివరాలు

షెడ్ల పరిధి	యూనిట్ విలువ (రూ.లో)	రాయితీ (రూ.లో)	రైతు చెల్లించాల్సింది (రూ.లో)
2 పశువులు	1,15000	1,03,500	11,500
4 పశువులు	1,85,000	1,66,000	18,500
6 కంటే ఎక్కువ	2,30,000	2,07,500	23,000
20 గొర్రెలు, మేకలు	1,30,000	91,000	39,000
50 గొర్రెలు, మేకలు	2,30,000	1,61,000	69,000
100 కోళ్లు	87,000	60,900	26,100
200 కోళ్లు	1,32000	92,000	39,600

కుంట ఆక్రమణపై సబ్‌కలెక్టర్ పరిశీలన


కుంట సర్వేలో అవకతవకలను వివరిస్తున్న జనార్దన్‌రెడ్డి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కాశిరెడ్డి కుంట ఆక్రమణలను మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ మంగళవారం స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. కుంట ఆక్రమణపై బండారు జనార్దన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సబ్‌కలెక్టర్ విచారణ చేపట్టారు. కుంట స్థలంలో రామకృష్ణ ధ్యాన మందిరం, కాశినాయన మందిరం, గాయత్రి మాత ఆలయం తదితర నిర్మాణాలు ఉన్నాయని గుర్తించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుడు జనార్దన్‌రెడ్డిని పిలిపించి తన ఫిర్యాదుపై ప్రశ్నించారు. కుంటను అడ్డగోలుగా సర్వే చేసి ఉత్తరం వైపు ఉన్న తన స్థలాన్ని కుంటలోకి కలపడం దారుణమని జానర్దన్‌రెడ్డి వివరించారు. కుంట మధ్యలో సిమెంట్ రోడ్డు ఎలా వేశారని ప్రశ్నించారు. కుంట సర్వేలో అవకతవకలపై విచారణ చేపట్టాలని కోరారు. సానుకూలంగా స్పందించిన సబ్‌కలెక్టర్ కుంట రికార్డులు పరిశీలించి, హద్దులను పూర్తిగా సర్వే చేయాలని ఆదేశించారు. కుంట ఆవరణలో పరిశుభ్రత పాటించకపోవడంపై కమిషనర్ వెంకటదాసుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నంద్యాల ఒంగోలు జాతీయ రహదారికి ఇరువైపులా డ్రైనేజీపై ఆక్రమణలు తొలగించాలని సూచించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు అప్పిశెట్టి ఉదయ్‌శంకర్ గిద్దలూరు పట్టణంలో ప్రెస్‌క్లబ్‌కు స్థలం కేటాయించాలని కోరారు. గతంలో ప్రెస్‌క్లబ్ కోసం కలెక్టర్‌ను కలిశామని, సంబంధిత కార్యాచరణను త్వరితగతిన పూర్తి చేయాలని సబ్‌కలెక్టర్‌ను కోరారు. తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి, సర్వేయర్ ఆంజనేయులు, టౌన్‌ప్లానింగ్ అధికారులు రాజారెడ్డి, హనుమానాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

- రాష్ట్ర కమిటీ సభ్యురాలు పద్మావతి


మాట్లాడుతున్న పద్మావతి, పక్కన సీఐ సుబ్బారావు

మార్కాపురం: బాలల హక్కుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి తెలిపారు. మంగళవారం పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో శిశు సంరక్షణ చట్టాలపై అంగన్‌వాడీ, ఆశావర్కర్లకు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కుల చట్టాల గురించి అవగాహనతో పాటు కార్యాచరణ ఉండాలని తెలిపారు. గ్రామస్థాయిలో బాలల కోసం సర్పంచ్ చైర్మన్‌గా రక్షణ కమిటీలు ఏర్పాటు చేశామని, ఇందులో అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, వీఆర్‌ఓ, పంచాయతీ సెక్రటరీ, మహిళా పోలీసులు, ఎన్‌జీఓ సంస్థ ప్రతినిధి, ఉపాధ్యాయులతో పాటు 11 మంది సభ్యులుంటారని, మండల స్థాయిలో తహశీల్దార్ చైర్మన్‌గా కమిటీ ఉంటుందని వివరించారు. విద్యార్థులు, విద్యార్థినులపై లైంగికదాడులు జరగకుండా ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామ రక్షణ కమిటీలు డ్రాపవుట్స్‌ను నిరోధించాలని, బాల్య వివాహాలను అరికట్టాలని సూచించారు. మార్కాపురం సీఐ సుబ్బారావు మాట్లాడుతూ తమ శాఖ తరఫున పాఠశాలల్లో గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌లు వివరించామని, లైంగిక దాడికి పాల్పడిన వారిపై పోక్సో కేసులు నమోదు చేశామని అన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు తమ శాఖ సహకారం అందిస్తుందని చెప్పారు. ముందుగా సబ్‌కలెక్టర్ త్రివినాగ్ తదితరులు జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ ప్రతినిధి నీలిమ, ఆర్ సునీల్‌కుమార్, సీడీపీఓ సుశీల, సూపర్‌వైజర్లు బుజ్జి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే చర్యలు

కంభం: బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని సహాయకార్మిక శాఖాధికారి బాలకాశి హెచ్చరించారు. పట్టణంలో పలు దుకాణాలను విద్యాశాఖాధికారులు, పోలీసు సిబ్బందితో కలిసి మంగళవారం ఆయన తనిఖీ చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించాలని సూచించారు. 14 ఏళ్లలోపు చిన్నారులను పనిలో పెట్టుకోవద్దని హోటళ్ళు, దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థల యజమానులకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శర్వాణి, హెడ్‌కానిస్టేబుల్ రమేష్, వార్డెన్ కోటిరెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్లు బురదమయం..

నడక నరకప్రాయం


రామాపురంలో బురదమయంగా మారిన రోడ్డు


జేపీ చెరువులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే మార్గం బురదనీరు

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు, రామాపురం గ్రామాల్లో సిమెంట్ రోడ్లు బురదమయం కావడంతో స్థానికులు నడిచేందుకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కొద్దిపాటి వర్షానికే రోడ్లపై నీరు ఎటూ వెళ్లే మార్గం లేక అక్కడే నిల్వ ఉంటున్నాయి. రోజుల వ్యవధిలోనే బురదమయంగా మారి ప్రజలకు చిరాకు పుట్టిస్తున్నాయి. డ్రెయినేజీ సక్రమంగా లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. జేపీ చెరువు గ్రామంలో పాఠశాలకు వెళ్లే మార్గంలో సిమెంటు రోడ్డుపై బురద ఉండటంతో విద్యార్థులు పలుమార్లు జారి పడ్డారు. పంచాయతీ అధికారులు స్పందించి రోడ్లపై నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పొదిలిలో వాకర్స్ ట్రాక్ అభివృద్ధి


ట్రాక్‌ను శుభ్రం చేయిస్తున్న కరీముల్లా బేగ్

పొదిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వాకర్స్ ట్రాక్ అభివృద్ధి పనులను హబీబుల్లా బేగ్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ కరీముల్లా బేగ్ మంగళవారం చేపట్టారు. ట్రాక్‌పై, ఇరువైపులా గడ్డి, పిచ్చిమొక్కలు పెరగటంతో విష సర్పాలు సంచరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ట్రాక్‌ను శుభ్రం చేయించడంతోపాటు గుంతలు ఏర్పడిన చోట మట్టి పోయించి చదును చేయించారు. ఈ సందర్భంగా కరీముల్లా బేగ్‌ను వాకర్స్ క్లబ్ సభ్యులు అభినందించారు.

అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు

గిద్దలూరు రూరల్: కార్తీక మాసం సందర్భంగా పట్టణంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామి మూలవిరాట్‌తోపాటు శివుడికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహికంగా హనుమాన్ చాలీసాను పారాయణం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అల్పాహారం అందజేశారు.

ఘనంగా కార్తీక ఏకాదశి పూజలు

మార్కాపురం టౌన్: కార్తీక ఏకాదశి సందర్భంగా మంగళవారం స్థానిక శివాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునే ఆలయానికి చేరుకుని దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. జగదాంబ సమేత మార్కండేశ్వరస్వామి దేవస్థానంలో మార్కండేశ్వరుడిని శివుడు, విష్ణుమూర్తిగా అలంకరించి పూజలు నిర్వహించారు.


శివ, విష్ణు అలంకారంలో మార్కండేశ్వరుడు

విద్యార్థులకు ఆర్టీసీ బస్సు ఏర్పాటు


క్యూలో బస్ ఎక్కుతున్న విద్యార్థులు

సాక్షి ఎఫెక్ట్..

బేస్తవారిపేట: ఆర్టీసీ బస్ సమయాన్ని మార్చడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఈనెల 10వ తేదీన 'విద్యార్థుల అవస్థలు' అనే శీర్షికన సాక్షిలో ప్రచురించిన కథనానికి గిద్దలూరు ఆర్టీసీ డిపో అధికారులు స్పందించారు. సాయంత్రం పాఠశాలలు వదిలిన తర్వాత 5.30 గంటలకు బస్ ఏర్పాటు చేశారు. దీంతో పెద్ద ఓబినేనిపల్లె, గొల్లపల్లె గ్రామాలకు చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

నేడు చెన్నకేశవస్వామి తెప్పోత్సవం

- కార్తీక మాసంలో చిలుకు ద్వాదశి సందర్భంగా..


అధికారులకు సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం టౌన్: కార్తీక మాసంలో చిలుకు ద్వాదశి సందర్భంగా బుధవారం సాయంత్రం మార్కాపురంలోని శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మి చెన్నకేశవస్వామి తెప్పోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈఓ శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. స్వామివారు ఉభయ దేవేరులతో కలిసి సాయంత్రం 5 గంటలకు పుష్కరిణిలో విహరిస్తారని తెలిపారు. మంగళవారం స్వామివారి పుష్కరిణిని సబ్‌కలెక్టర్ త్రివినాగ్, సీఐ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు తదితరులు పరిశీలించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా రెవెన్యూ, పోలీసు, దేవదాయ మున్సిపల్, విద్యుత్‌శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సబ్‌కలెక్టర్ ఆదేశించారు. కాగా, తెప్పోత్సవం సందర్భంగా స్వామివారి పుష్కరిణిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. డీఎస్పీ నాగరాజు ఆధ్వర్యంలో నలుగురు సీఐలు, 12 మంది ఎస్సైలు, 200 మంది కానిస్టేబుల్స్ ఇంకా స్పెషల్‌పార్టీ పోలీసులు, హోంగార్డులు బందోబస్తులో పాల్గొంటున్నట్లు సీఐ సుబ్బారావు వివరించారు. పట్టణ ఎస్సై సైదుబాబు, విద్యుత్ ఏడీఈ సియానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహాసత్సంగం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యోగాటీచర్, నాయకులు

గిద్దలూరు రూరల్: ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా వ్యవస్థాపకుడు సద్గురు రవిశంకర్ గురూజీ ఆధ్వర్యంలో విజయవాడలో బుధవారం నిర్వహించనున్న మహాసత్సంగం వాల్‌పోస్టర్‌ను యోగా టీచర్ బీఎస్ నారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు అక్కి పుల్లారెడ్డి, బేస్తవారిపేట ఎంపీపీ ఓసూరారెడ్డి ఆవిష్కరించారు. మంగళవారం గిద్దలూరులోని అక్కి పుల్లారెడ్డి నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో యోగా టీచర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆనందకరమైన జీవితం గడిపేందుకు మహాసత్సంగాలు దోహదపడతాయన్నారు. మహాసత్సంగంలో పాల్గొనేవారు 9441932390ను సంప్రదించాలని సూచించారు.

ఉపాధి హామీ సిబ్బంది నిరసన


నిరసన తెలుపుతున్న ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది

మార్కాపురం రూరల్: పర్చూరులో ఉపాధి హామీ ఏపీఓపై కత్తితో దాడి చేయడాన్ని నిరసిస్తూ మార్కాపురం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట మంగళవారం ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు జీవరత్నం మాట్లాడుతూ.. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

మొక్కజొన్నలో ఫిప్రోనిల్ గుళికలు చల్లుకోవాలి


మాట్లాడుతున్న ఏఓ జక్కం మెర్సీ

బేస్తవారిపేట: మొక్కజొన్న పంటలో రసం పీల్చు పురుగు నివారణకు ఫిప్రోనిల్ గుళికలు ఎకరానికి 8 కిలోలు చల్లుకోవాలని వ్యవసాయాధికారిణి జక్కం మెర్సీ సూచించారు. మంగళవారం చెట్టిచర్ల, వంగపాడులో రైతులకు పంట యాజమాన్యంపై అవగాహన కల్పించారు. ఎకరానికి 15 పసుపు రంగు, 15 నీలం రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేస్తే రసం పీల్చు పురుగును కట్టడి చేయవచ్చని చెప్పారు. మొక్కజొన్న విత్తనాలు విత్తనోత్పత్తి కోసం సాగు చేసే రైతులు తప్పనిసరిగా అగ్రిమెంట్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అధికారి డి.శ్వేత, ఏఈఓ ఆదిగణేష్, వీఏఏలు సరస్వతి, రసూల్ పాల్గొన్నారు.

చీడపీడలపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

పొదిలి: ఖరీఫ్, రబీ సీజన్‌లో సాగు చేసిన పైర్లకు చీడపీడలు ఆశించేందుకు వాతావరణం అనుకూలంగా ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి ఎస్‌కే జైనులాబ్దీన్ సూచించారు. మంగళవారం నగర పంచాయతీ పరిధిలోని మాదాలవారిపాలెం,నందిపాలెంలో రైతులకు అవగాహన కల్పించారు. కందిలో రసం పీల్చు పురుగుల ఉధృతిని తగ్గించేందుకు పొలం గట్ల వెంట ఎర పంటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారి ధనలక్ష్మి, పశు సంవర్ధక, మార్కెటింగ్, వీఏఏలు పాల్గొన్నారు.

పంట బీమాకు రైతుల వాటా చెల్లించాలి

గిద్దలూరు రూరల్: పంట బీమాకు రైతులు ప్రీమియం చెల్లించాలని స్థానిక వ్యవసాయశాఖాధికారి విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. మండలంలోని అంబవరం, వెల్లుపల్లె గ్రామాల్లో రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ.. పొగాకు సాగుకు బదులు ప్రత్యామ్నాయ పంటలు పండించాలని సూచించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించాలని చెప్పారు. కంది పంటను పరిశీలించి రైతులకు సలహాలిచ్చారు. ఉద్యానవనశాఖాధికారి విష్ణుప్రియ ఉద్యాన పంటల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, వీఏఏలు పాల్గొన్నారు.

ఈ–పంట నమోదుతో మేలు

తర్లుపాడు: రబీ సీజన్‌లో పంటలను సాగుచేస్తున్న రైతులు ఈ పంటలో వివరాలు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. మండలంలోని పోతలపాడు, గానుగపెంట గ్రామాల్లో మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. పొగాకుకు బదులు శనగ, మినుము, కంది, పెసర, అలసంద, సజ్జ, కొర్ర సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ ఖాశింవలి, వీఏఏలు ముని కాశయ్య, బాబు, మనోజ్, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

పప్పు ధాన్యాలు సాగు చేయాలి

కొనకనమిట్ల: రైతులు పెట్టుబడి తక్కువగా ఉండే పప్పు ధాన్యాల సాగుపై దృష్టి సారించాలని ఏఓ ప్రసన్న రంగలక్ష్మి సూచించారు. మంగళవారం పెదారికట్ల, చినారికట్ల గ్రామాల్లో రైతులకు సాగులో మెళకువలపై అవగాహన కల్పించారు. పొగాకుకు బదులు ప్రత్యామ్నాయ పంటలైన కంది, సజ్జ, అలసంద, మినుము, పప్పు శనగ సాగు చేయాలని చెప్పారు. విదేశాలకు పొగాకు ఎగుమతి ఆగిపోతే మద్దతు ధర లేక నష్టపోయే అవకాశం ఉందన్నారు. సమావేశంలో ఆయా గ్రాఆమల సర్పంచ్‌లు చెంచయ్య, అనూరాధ, ఏఈఓ విక్రమ్, వీఏఏలు అరవింద్, శ్రీరామ్, రైతులు పాల్గొన్నారు.